# అమూల్యం

"అన్నపూర్ణా ! కాఫీ !"

బెడ్‌రూం లోంచే కేకపెట్టారు శివరామయ్యగారు.

ప్రతిరోజూ శివరామయ్యగారి దినచర్య ఆ పిలుపుతో ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి, మళ్లీ రాత్రి నిద్రకుపక్రమించేదాకా భార్యను ఓ వందసార్లయినా దేనికో ఒకందుకు ఆయన అలా పిలుస్తూనే వుంటారు.

శివరామయ్యగారు హైస్కూలు హెడ్‌మాస్టరుగా పనిచేసి పదేళ్ళక్రితమే రిటైరయ్యారు. ఆయన ఉద్యోగంలో ఉన్నప్పుడైతే , స్కూలుకు వెళ్లాలన్న తొందరలో, కొన్ని పనులైనా ఆయన స్వయంగా చేసుకునేవారు. రిటైరయ్యాక, ఈ పదేళ్ళనించీ బద్ధకం మరీ ఎక్కువైపోయింది. దానికి సాయం వయోభారం ఒకటి !

ఉదయం నిద్రమంచం దిగటానికి ముందే ఆయనకు బెడ్‌కాఫీ ఇవ్వాలి. తర్వాత కాలకృత్యాలు తీర్చుకున్నాక కవ్వంతో చిలికిన మజ్జిగ కావాలి. వసారాలో ఆయన కోసం పడక్కుర్చీ వాల్చాలి. పేపరుబోయ్ వీధి కిటికీలో పేపరు వేసిపోతే దాన్ని తెచ్చి అందించాలి... ఇంకా బాత్‌రూమ్‌లో సోపూ, టవలూ పెట్టటం, బీరువాలోంచి ఇస్త్రీ బట్టలు తీసివ్వటం, మొదలుకొని రాత్రి పడుకోబోయేముందు గ్లాసుతో వేడిపాలు ఇవ్వటం వరకూ అన్నీ అన్నపూర్ణ చేయవలసిందే !

"ఏమోయ్ ! వినపడలేదా ?..కాఫీ " - రెండునిమిషాల తర్వాత మళ్ళీ కేకపెట్టారు శివరామయ్యగారు.

"వినపడింది ! ఇదిగో ...తెస్తున్నా !" అంటూనే అన్నపూర్ణమ్మ వచ్చి కాఫీగ్లాసు అందించింది.

"తెల్లవారితేచాలు -ఈ అందింపులతో ఛస్తున్నాను " - భర్త కాఫీ తాగుతూంటే ఎదురుగా వున్న స్టూలు మీద కూర్చుని విసుక్కుంది అన్నపూర్ణ. ఆయన కాఫీ తాగిన తర్వాత మళ్లీ ఆగ్లాసు తీసుకెళ్లాలి. అందుకే ఆ కాసేపూ అలా కూర్చుంటుంది.

"ఇంకెంత కాలం లేవోయ్ ! రేపోమాపో ఆ శివుడాజ్ఞ అయిపోతుంది. అపుడు నీకంతా విశ్రాంతే !" - అన్నారాయన కాఫీ చప్పరిస్తూనే.

"ఛ...ఛ ! పొద్దున్నే అమంగళం పలక్కండి !"

"అది అమంగళం ఎందుకవుతుందోయ్ ? వయస్సయిపోయినవాణ్ణి ! ఏ క్షణాన ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు ? మొన్నరాత్రి బాత్‌రూంకి వెడుతూ కళ్ళుతిరిగి పడిపోయాట్ట అవధాని.... నీకూ తెలూసుగా ?.. గంటయినా లేవలేదని - ఆస్పత్రికి తీసుకెడితే - ప్రాణంపోయి అరగంటయిందని చెప్పాడు డాక్టరు !...... నా కంటే మూడేళ్ళు చిన్నవాడు. ఏం చెప్తాం ?.... అయినా గుప్పెడంత గుండె ఆగిపోవటానికి ఉప్పెనంత జబ్బు రావాలా ఏం? " ఖాళీ అయిన కాఫీ గ్లాసు ఆమెకు అందిస్తూ అన్నారు శివరామయ్యగారు .

"ఆ పిలుపేదో మీకంటే ముందు నాకే వస్తుందిలెండి !" - అంటూ ఆవిడ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆ వంటింట్లో దేవుడి పటాలముందు నిలబడి కళ్ళుమూసుకుని - రెండునిమిషాలు భక్తితో అందరు దేవుళ్ళకూ మొక్కుకుంది. తర్వాత మంగళసూత్రాల్ని కళ్ళకు అద్దుకుంది. భర్తంటే ఆవిడకు భక్తి గౌరవాలు మాత్రమేకాదు - అవ్యాజమైన ప్రేమానురాగాలు కూడా వున్నాయి.

ఇవాల్టిదా ?...దాదాపు నాలుగు దశాబ్దాల అన్యోన్య దాంపత్యం వాళ్ళది.

పెళ్ళయిన చాలాకాలం వరకూ వాళ్లకు పిల్లలు కలగలేదు. ఎన్నో నోములూ వ్రతాలూ చేశాక, ఎందరు దేవుళ్లకో మొక్కుకున్న తర్వాత - ఆవిడ కడుపు పండింది. మగపిల్లవాడు పుట్టాడు. 'రాఘవరావ' ని తాతగారి పేరు పెట్టారు.

ఆ తర్వాత మరి వాళ్ళకు పిల్లలు పుట్టలేదు. రాఘవని ఎంతోగారంగా అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేశారు.. ఇప్పుడు రాఘవ - తల్లి తండ్రులకు దూరంగా వేల మైళ్ల దూరంలో, జంషెడ్‌పూర్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. అప్పుడప్పుడు కుటుంబ సమేతంగా వచ్చి ఓ నాలుగైదురోజులు తల్లితండ్రులతో గడిపి వెడుతూంటాడు. వచ్చినపుడల్లా వాళ్ళను తనతో జంషెడ్‌పూర్ వచ్చేయమని బలవంతం చేస్తాడు. కానీ వాళ్లు వినరు !

"ఇక్కడ మాకు బాగానే వుంది కదరా !" - అని తేలిగ్గా అతని మాటల్ని కొట్టిపారేస్తూంటారు శివరామయ్యగారు.

ఈ చివరి రోజుల్లో కొడుకు ఆశ్రయంలో వుండి - మనవలతో కాలక్షేపం చేయాలని అన్నపూర్ణ మనసులో వున్నా - భర్త మాటను కాదనలేదు.

"పోనీ మనం వాళ్ళ దగ్గరకెళ్ళి ఉండచ్చుకదండీ !.. ఈ ఇంటిమీద వచ్చే అద్దె డబ్బులు అబ్బాయిచేతిలో పెడితే వాడూ సంతోషిస్తాడు " - అని ఓ సారెపుడో ఆవిడ - భర్తను అడిగింది.

"అక్కడికి వెడితే స్వేచ్ఛ ఎక్కడుంటుందోయ్ ? అన్నింటికీ వాళ్ళ ప్రాపకం మీద ఆధారపడాలి. ఆఖరికి ఇంత ' బెల్లంముక్క ' బుగ్గను పెట్టుకోవాలనిపించినా - కోడల్ని అడగాలి. ఇక్కడైతే మనిష్టం ! లంకంత ఇల్లుంది. తెచ్చిపెట్టే తాహతు నాకుంది. చేసిపెట్టే ఓపిక నీకుంది...పైగా ఈ ప్రైవసీ, ఈ స్వేచ్ఛా అసలక్కడ ఎలా వుంటాయనుకుంటున్నావ్ ?" - అంటూ శివరామయ్యగారు ఆవిడ కోరికను తేలిగ్గా కొట్టిపారేసారు.

ఆ మాటా నిజమే !

తమ ఇంట్లో వున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పరాయిచోట ఎలా వస్తాయి. పెళ్ళయ్యే వరకే కొడుకు ! ఆ తర్వాత - 'కోడలి భర్త' వుతాడు. అప్పుడు 'కన్నవాళ్ళ' న్న గౌరవం వుండచ్చు... అంతే !..కానీ ప్రేమానురాగాలు వుండద్దూ ?...

ఈమధ్య రెండేళ్లనించీ అన్నపూర్ణకు కీళ్ళనొప్పులు పట్టుకున్నాయి. పగలంతా ఆ పనీ ఈ పనీ చేసి రాత్రికి మంచంమీద నడుం వాల్చగానే కాళ్ళు లాగేస్తాయి.... అపుడు శివరామయ్యగారు అమృతాంజనం రాసి ఓ అరగంటసేపైనా మర్దనా చేస్తారు. మొదట్లో అలా తన భర్తతో సేవ చేయించుకోవటం ఎంతో సిగ్గుగా, తప్పుగా అనిపించేది. కానీ రాను రాను తప్పని సరై - అలవాటుగా మారిపోయింది. ఇపుడు ఆయన అమృతాంజనం మర్దనా చేయకపోతే ఆవిడకసలు నిద్ర పట్టదు. మరి ఇంకోచోటకు వెళ్ళివుంటే - ఈ రకంగా భర్తతో సేవ చేయించుకునే అవకాశం వుంటుందా ?...

ఆరాత్రి అలాగే అమృతాంజనం రాస్తున్న శివరామయ్యగారు అన్నపూర్ణతో యదాలాపంగా అన్నారు -

"రోజూ నీకీ సేవ చేయలేక ఛస్తున్నా ! నాచేతులు లాగేస్తున్నాయ్"

అప్పుడు అన్నపూర్ణ ఆప్యాయంగా భర్త చేయి తన చేతుల్లోకి తీసుకుని -

"ఇంకెంతకాలం చేస్తారండీ ఈ సేవ ?.. రేపోమాపో నేనెలాగా గుటుక్కుమంటాను. నాకంటే అయిదేళ్ళు చిన్నది - మా పిన్ని కూతురు వర్ధనం !.. ఆ మధ్య 'తలనొప్పి' అని పడుకుంది... మరి లేవలేదు ! మీకూ తెలుసుగా !.... వయస్సై పోయిన ముసలిదాన్ని... ఏ క్షణాన ఏమవుతుందో ఎవరు చెప్పగలరూ? ... అయినా గుప్పెడు గుండె ఆగి పోవటానికి ఉప్పెనంత జబ్బురావాలా అని పొద్దున్న మీరే అన్నారుగా ?" - అంది.

ఎందుకో శివరామయ్యగారి గొంతులోకి దుఃఖం పెల్లుబికి వచ్చింది ఆ క్షణాన !... పెదవి విప్పి మాట్లాడలేక పోయారు !...

★ ★ ★

రాఘవ ఆఫీసునించి వస్తూనే 'జానకీ' అని పిలిచాడు ఉత్సాహంగా.

"ఏమిటండీ . ఏమిటా ఉత్సాహం ? - ప్రమోషనొచ్చిందా ?" - కాఫీ ఫ్లాస్కుతో అక్కడికి వస్తూ అడిగింది జానకి.

"ప్రమోషన్ కాదు జానకీ ! ఉత్తరం వచ్చింది " - షూ లేసులు విప్పుకుంటూ చెప్పాడు రాఘవ.

జానకి అర్థం కానట్టు చూసింది.

"ఎపుడూ లేనిది మా అమ్మ ఉత్తరం రాసిందోయ్ !" -షర్టు జేబులోంచి కవరు తీశాడు.

"ఏం రాశారేమిటి ?"

"చదువుతాను విను" -కవర్లోంచి ఓ పొడవైన కాగితం తీసి చదవటం ప్రారంభించాడు రాఘవ.........

"ఒరేనాన్నా.. రాఘవా! నేను నీకెపుడూ ఉత్తరం రాయలేదు కదూ ? ఇవాళ రాస్తున్నాను. నా అక్షరాలు సరిగ్గా వున్నాయో లేదో?.. జాగ్రత్తగా చదువుకోవాలి... ఈ మధ్య నా కెందుకో భయం పట్టుకుందిరా నాన్నా.. నవ్వద్దు సుమా ! ఏ క్షణాన నేను చనిపోతానోనన్న భయం !...ఎందుకంటే నాకంటే చిన్నవాళ్లు ఈమధ్య చాలామంది చనిపోతున్నారు... అయినా నాకూ అరవైఏళ్ళు దాటాయికదా. ఒకవేళ నేను హఠాత్తుగా కన్నుమూస్తే మీ నాన్న ఒంటరివారై పోతారు... అపుడు ఈ ఇంట్లో ఒక్కరూ ఉండలేరు. ఆయనకెంత బెంగగా వుంటుందో నాకు తెలుసు. ఆ బెంగతో ఆయనకూడా ఆట్టేకాలం వుండరులే!... కానీ వున్న నాలుగు రోజులూ ఆయనకు ఏలోటూ రాకుండా చూసుకోవాలి. నువ్వేమో పెద్ద ఇంజనీరువాయె. వీధిలో బోలెడు పనులుంటాయి. కోడలు పిల్ల దగ్గర నాన్నగారికి మొహమాటం ఎక్కువ. అందుకే నేనీ వుత్తరం రాయవలసి వచ్చింది.......

"ఆయనకు పొద్దున్నే బెడ్‌కాఫీ తాగటం అలవాటు. అదికుడా రాత్రే 'డికాక్షన్' ఫిల్టర్ వెయ్యాలి. స్నానం అయ్యాక కవ్వంతో చిలికిన మజ్జిగ తాగుతారు... అన్నట్టు ఆయన తెలుగు పేపరే చదువుతారన్న సంగతి నీకు గుర్తుందిగా !.. ఇకపోతే రోజూ మజ్జిగలో వెన్నతీసి ఆ వెన్నతో ప్రతిశనివారం పెసరట్లు వేసి పెట్టాలి.. ప్రతి రోజా- వేసవికాలంలో కూడా-

ఆయన్ని వేణ్ణీళ్లే పోసుకోమన్నారు డాక్టర్లు !... రాత్రిళ్లు పడుకునేముందు ఓ గ్లాసు వేడిపాలు తాగుతారు... ఈ వివరాలన్నీ నీకెందుకు రాస్తున్నానో తెలుసా ?.. కోడలు పిల్లకు చెప్పి వున్న నాలుగు రోజులూ ఆయనకు ఆ ప్రకారం అన్నీ జరిగేలా చూస్తావని !....

"....నేనెప్పుడూ నిన్ను 'అదికావాలీ, ఇది కావాలీ' అని 'అమ్మ'గా అడగలేదు. ఇవాళ ఎందుకో మీ నాన్నకు భార్యగా ఈ కోరిక 'నిన్ను' కోరాలనిపించింది. మీ నాన్నకు నువ్వు లోటు చేస్తావని కాదు... కానీ నా తృప్తికోసం రాస్తున్నా...అంతే ! నా పిచ్చి ఆలోచనకు నవ్వుకోవద్దు... వుంటామరి !....

ఇట్లు
అమ్మ...!"

ఉత్తరం చదవటం ముగించి జానకివైపు చూశాడు రాఘవ...పైటచెంగుతో ఆమె కళ్ళు ఒత్తుకోవటం గమనించి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి జానకీ ?" అని ప్రశ్నించాడు.

"ఏం లేదు... ఉండండి !" - అంటూ లేచి టేబుల్‌మీద 'టీవీ' పక్కన వున్న ఇన్‌లాండ్ కవరు తీసుకొచ్చింది.

"ఏమిటదీ ?" ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసుకుంటూ అడిగాడు.

"నాపేర వచ్చిన వుత్తరం.. మావయ్యగారు రాశారు...చదువుతా వినండి " - అంటూ కవరు విప్పి చదవసాగింది జానకి.

"......అమ్మాయ్ జానకీ !

ఎపుడూ అబ్బాయికి రాయటమే కానీ నీపేర ఉత్తరాలు రాయలేదు. కానీ ఇవాళ ఎందుకో రాయాలనిపించింది... ఆశ్చర్యపోకు సుమా ! మొన్ననే నాకు డెబ్భయ్యేళ్లు నిండాయి. ఎప్పటిలా మీ అత్తయ్య నా పుట్టినరోజున ఆంజనేయస్వామి గుళ్ళో ఆకుపూజ చేయించింది. నేనంటే దానికి ప్రాణం ! పిచ్చిది... నా ఆరోగ్యం కోసం పూజలూ పునస్కారాలు చేస్తుందే తప్ప తన ఆరోగ్యం గురించి బొత్తిగా పట్టించుకోదు... ఏ మనిషైనా నిండు నూరేళ్ళు బతకటం కష్టం కదా ! ఈ మధ్య నా ఒంట్లో అంత బాగుండటం లేదు . డాక్టర్లకు చూపిస్తే 'రోగం' ఏదీ లేదన్నారు. నన్నడిగితే 'ముసలితనమే' ఓ పెద్దరోగం అంటాను. నాకంటే చిన్నవాళ్లే వెళ్లిపోతున్నారు.. నేనుకూడా అట్టే కాలం ఉండనేమోనన్న భయం పట్టుకుంది....

".........నా తర్వాత మీ అత్తయ్య ఎలాగా మీ దగ్గరకు రావాల్సిందే. నేను లేకపోతే దానికి

క్షణం తోచదు. ఆ బెంగతో అదీ ఆట్టేకాలం బతకదని నాకు తెలుసు !...వున్ననాలుగు రోజులూ దానికి ఏ లోటూ రాకుండా చూసుకోవాలి మీరు !....అత్తా కోడళ్ల మధ్య పొత్తుకుదరదని అందరూ అంటూంటారు. అందుకే నీకీ ఉత్తరం రాయవలసివచ్చింది......

"..............దానికి నువ్వంటే చాలా ప్రేమ ! తన నగలన్నీ తను బ్రతికుండగానే నీకు ఇచ్చేస్తానని చాలా సార్లు అంటోంది... ఈ మధ్య రెండేళ్ళనించీ దానికి కీళ్ళనొప్పులు వస్తున్నాయి. ప్రతిరోజూ రాత్రి పడుకునేముందు అమృతాంజనం రాసి ఓ అర్ధగంటయినా మర్ధనా చేయాలి !.... అభిమానంతోనూ, సిగ్గుతోనూ ఈ సంగతి నీకది చెప్పలేక పోవచ్చు...... అందుకే ప్రత్యేకించి నీకు రాస్తున్నాను. అది బతికున్న నాలుగురోజులూ ఓ అత్తగారిగా కాకుండా నీ కన్నతల్లిగా చూసుకుని సేవచేయమని కోరుతున్నాను. 'నేనోపిచ్చివాణ్ణి' అని నువ్వనుకోవద్దు... వుంటామరి.!....

ఇట్లు..
శివరామయ్య..."

ఉత్తరం చదవటం పూర్తిచేసి భర్తవైపు చూసింది జానకి.

అతని కళ్లల్లో కన్నీరు మెరుస్తోంది.

"ఇందాకా మీరు ఉత్తరం చదివినపుడు నేను కళ్లువత్తుకుంటే 'ఏమిట'ని అడిగారు కదా ?...ఆ ప్రశ్నకు ఇప్పుడు జవాబు దొరికిందా ?-" ప్రశ్నించిందామె.

"దొరికింది జానకీ ! భార్యా భర్తల బంధం ఎంత ఆత్మీయంగా, మరెంత గాఢంగా వుండాలో కూడా అర్ధమైంది " - అన్నాడు రాఘవ కర్చీఫ్‌తో కళ్లు ఒత్తుకుంటూ.

" ఆ ఉత్తరం ఇలా ఇవ్వండి ! రెండూ కలిపి తీగకు గుచ్చుతాను "- అంటూ భర్త చేతిలోని ఉత్తరాన్ని అందుకోబోయింది జానకి.

"వద్దు జానకీ ! వీటిని తీగకు గుచ్చొద్దు !. ఆల్బంలో అతికిద్దాం ! రేపు మన పిల్లలూ వాళ్ల పిల్లలూ అందరూ ఈ ఉత్తరాలు చదవాలి ! భార్యా భర్తల మధ్యా, తల్లి తండ్రులూ పిల్లల మధ్యా, వుండవలసిన అనురాగాలూ, ఆత్మీయతలూ, అనుబంధాలూ సడలిపోతున్న ఈ యాంత్రిక యుగంలో ఇలాంటి ఉత్తరాలు ఎంతో అమూల్యమైనవి!...అందుకే వీటిని భద్రపరుద్దాం " - అన్నాడు రాఘవ దృఢంగా, తృప్తిగా !! ★

(ఆదివారం , ఈనాడు-11-3-90)